క్లుప్తంగా

బాగా పనిచేయండి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న వీఆర్వోల సంఘం

తిరుపతి అర్బన్: ''బాగా పనిచేయండి...మంచి పేరు తెచ్చుకోండి'' అంటూ వీఆర్వోల సంఘం నేతలకు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ శుక్రవారం కొత్త కమిటీ సభ్యులు కలెక్టరేట్‌కు విచ్చేశారు. ఈ నెల 8న కొత్త కమిటీని ఏర్పాటు చేసుకున్న విషయాన్ని కలెక్టర్‌కు వివరించారు. ఆ మేరకు కమిటీ సభ్యులను అధ్యక్షుడు నాగరాజు కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం కలెక్టర్‌ను సత్కరించారు.

బీజేపీ వైఖరి విడ్డూరం

తిరుపతి కల్చరల్ : టీటీడీలో గదుల ధరల పెంపును బీజేపీ మత సమస్యగా చిత్రీకరించడం విడ్డూరమని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమలలో సామాన్యులకు కేటాయించే గదుల్లో సౌకర్యాలు కల్పించి, ధరలు పెంచినట్లు టీటీడీ చెప్పడం సరికాదని పేర్కొన్నారు. సామాన్యులకు కేటాయించిన గదులను వారికే కొనసాగించాలని తెలిపారు.

ఫ్యాకల్టీ డీన్‌గా రత్నాకర్

తిరుచానూరు: ఎస్వీయూనివర్సిటీ సైన్స్ కళాశాల ఫ్యాకల్టీ డీన్‌గా భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యుడు రత్నాకర్‌ను నియమిస్తూ వర్సిటీ ఉపకులపతి కె.రాజారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆచార్య రత్నాకర్ గత 31 ఏళ్లుగా బోధన, పరిశోధన రంగాల్లో కృషి చేశారు. కావలి పీజీ సెంటర్ ఎస్‌వోగా, శాఖాధిపతిగా, బీవోఎస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఈయన ప్రస్తుతం డీన్ డెవలప్‌మెంట్‌గా పని చేస్తున్నారు. సైన్స్ ఫ్యాకల్టీ డీన్‌గా నియమితులైన రత్నాకర్‌ను రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్‌తో పాటు పలువురు ఆచార్యులు అభినందనలు తెలిపారు.

షార్ప్ సేవలు ప్రశంసనీయం



ప్రశంసా పత్రం అందుకుంటున్న అరుణ

తిరుపతి కల్చరల్: గ్రామీణ ప్రాంతాల్లో తిరుపతికి చెందిన శ్రీహరి అసోసియేషన్ ఫర్ రూరల్ ప్రోగ్రామ్ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ కొనియాడారు. నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం డీఆర్‌డీఏలో జరిగిన జాతీయ యువజనోత్సవం సందర్భంగా షార్ప్ సంస్థ అధ్యక్షురాలు జి.అరుణకు ఆయన ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించి అభినందించారు.

సిమ్స్ విద్యార్థినికి పీహెచ్‌డీ ప్రదానం



తిరుపతి తుడా : స్విమ్స్ వర్సిటీలో బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగంలో పరిశోధక విద్యార్థి డాక్టర్ నలమోలు రవీనా మధులతకు పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ తెలిపారు. బయో ఇన్ఫర్మేటిక్స్ విభాగం చీఫ్ గైడ్ డాక్టర్ ఉమామహేశ్వరి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేయడంతో పీహెచ్‌డీని అందజేసినట్లు చెప్పారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం తెలంగాణ రాష్ట్రం తుంగదుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. మొదట వారు ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు.

అర్ధరాత్రి నుంచే భోగి ఆరంభం

- నగర వ్యాప్తంగా భోగి మంటలు



శిల్పారామం వద్ద ఎగిసిపడిన భోగి మంట

తిరుపతి కల్చరల్: తెలుగువారి పెద్ద పండుగ అయిన సంక్రాంతి సంబరాలు అర్ధరాత్రి నుంచే ఆరంభమయ్యాయి. మొదటి రోజు భోగి కావడంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే చీకట్లను చీల్చుకుంటూ భోగిమంటలు ఎగిసిపడ్డాయి. ఆనందోత్సాహాలతో యువత కేరింతల నడుమ వీధుల్లో, రోడ్లపైనా భోగి మంటలు వేశారు. ఇంటిలోని పాత వస్తువులను మంటల్లో వేసి దరిద్రాన్ని తరిమేశారు. పట్టణాలు, నగరాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులతో పల్లెలన్నీ కళకళలాడుతన్నాయి. తిరుపతి నగరంలో సంక్రాంతి సందడి కోలాహలం కనిపించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు దుస్తులు, వస్తువుల కొనుగోళ్లతో నగర వీధులు జన సందడితో కిక్కిరిశాయి.

ఇందిరా మైదానంలో..

శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా మైదానంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకుంది. ముందుగా గో పూజతో సంక్రాంతి సంబరాలు ప్రారంభమయ్యాయి. పొంగళ్లు వండి అందరికీ పంచారు. సంప్రదాయ పల్లెసీమ క్రీడలైన గోళీలు, బొంగరం, బిల్లాకోడి, తాటి మట్టతో క్రికెట్, కబడ్డీ, విలువిద్య, గంగిరెద్దులు, హరిదాసు, గొబ్బెమ్మ, కర్రసాము, దండోరా వంటి క్రీడలు నిర్వహించారు. భోగిపండ్లతో ఆశీస్సులందజేశారు. సంక్రాంతి ముగ్గులు వేశారు. భోగిమంటలు వేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం సంప్రదాయ ఆలసంద వడలు, సుగీలు, ఉద్దివడలు వంటి వంటకాలు అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు నవీన్‌కుమార్ రెడ్డి, గోపిప్రసాద్, విజయకుమార్, వెంకటేష్, చెంగారెడ్డి, ఆనంద్, మస్తాన్, వాసు, కరాటే శ్రీను, ఆర్‌సీ.మునిక్రిష్ణ, గుండాల గోపినాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుక పంపిణీ

తిరుపతి మంగళం: 14వ డివిజన్‌లోని సచివాలయ సిబ్బందికి, స్థానిక ప్రజలకు దుస్తులు, స్వీట్లతో కూడిన సంక్రాంతి కానుకను శుక్రవారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పంపిణీ చేశారు. దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ చేయని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సంక్షేమ పథకాలను పేదల ముంగిటకే అందిస్తున్నారన్నారు. సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ పథకాలను నేరుగా వారికి చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారికి ఎంత చేసినా తక్కువే అవుతుందని, సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్న ఉద్దేశంతో దుస్తులు, స్వీట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.



ఇందిరా మైదానంలో పొంగలి పెడుతున్న వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు



సచివాలయ సిబ్బందికి సంక్రాంతి కానుకను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

ప్రజలందరూ సుఖసంతోషాలతో సంక్రాంతి జరుపుకోవాలి





ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ పర్వదినాలను పురస్కరించుకుని నగర ప్రజలంతా భోగ భాగ్యాలతో జీవించాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి ఆకాంక్షించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయని, 2023లో మరిన్ని సంక్షేమ ఫలాలతో ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాలు విరజిల్లాలని కోరారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని ఆ పండుగలను ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత



ఎలక్ట్రిక్ ఆటోలను అందజేస్తున్న ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి

భాకరాపేట: పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి అన్నారు. తుడా నిధులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మంజూరు చేసిన చెత్త సేకరణ ఆటోలను శుక్రవారం చిన్నగొట్టిగల్లు, భాకరాపేట గ్రామ పంచాయతీలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేపట్టేటప్పుడే తడి, పొడి చెత్తను వేరు చేసి తీసుకొచ్చే విధంగా ఆటోలను తయారు చేస్తారని చెప్పారు. సర్పంచ్ మనోహర్, సాకిరి భూపాల్ పంచాయతీకి ఎలక్ట్రిక్ ఆటోలను ఇచ్చినందుకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమాన్ నాయక్, సూపరింటెండెంట్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

నగరి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొనే జట్టుకు శుక్రవారం కోచింగ్ క్యాంప్ ప్రారంభించారు. స్థానిక పీసీఎన్ ఉన్నత పాఠశాల మైదానంలో నగరి బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ రవిబాబు, చిత్తూరు జిల్లా ఎస్‌జీఎఫ్ చైర్మన్ సురేష్ బాబు ఆధ్వర్యంలో కోచింగ్ క్యాంపు నిర్వహించారు. క్యాంప్‌నకు హాజరైన క్రీడాకారులు ఈ నెల 23, 24, 25వ తేదీల్లో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొంటున్నట్లు వారు తెలిపారు. ఈ క్యాంప్‌లో కోచ్ గోపి, పీడీలు దాము, బాబు పాల్గొన్నారు.

నేడు మకరజ్యోతి దర్శనం



సదుం: అయ్యప్పస్వామి ఆలయం

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం మకరజ్యోతి దివ్యదర్శనం ఇవ్వనుంది. ముందుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరు ఆభరణాలకు సదుమ మ్మ ఆలయంలో పూజలు చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరేగింపుగా అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకుంటారు. ఆలయం వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం

నగరి: పట్టణంలోని బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భజనలు, అర్చన, నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు భజనల్లో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు కన్నప్ప, మునస్వామి, రమేష్ బాబు, మాదురి, దిలీప్‌కుమార్, భార్గవి, దేవేంద్ర, దుర్గాప్రకాష్ స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

గంధోత్సవానికి సర్వం సిద్ధం

కార్వేటినగరం: పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న హజరత్ సయ్యద్‌షా సబ్బర్ అవులియా జవాలి గంధోత్సవ నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా దర్గాను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 14వ తేదీ శనివారం రాత్రి 8 గంటలకు గంధం ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం దర్గాలో ఫతేహా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ప్రఖ్యాత ఖవ్వాలి గాయకుడు ముంబాయికి చెందిన మొయిన్‌నాజీం, హైదరాబాద్‌కు చెందిన సిమ్రన్‌తాజ్ ఆధ్వర్యంలో ఖవ్వాలి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఇంటా చెవిరెడ్డి 'సంక్రాంతి' కానుక





చంద్రగిరి, పాకాలలో సంక్రాంతి కానుకలను అందజేస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: సంక్రాంతి పండుగ వేళ నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పంపిన సంక్రాంతి కానుకలు సందడి చేశాయి. పండగ పూట తన నియోజకవర్గ ప్రజలు ఆనందంగా గడపాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే కొత్త దుస్తులు పంపిణీ చేశారు. పాకాల మండల పరిధిలోని పాకాల, ఉప్పరపల్లి, నేంద్రగుంట, యల్లంపల్లి ప్రాంతాల్లో శుక్రవారం తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కానుకలను అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. చంద్రగిరి మండలంలోనూ సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఎమ్మెల్యే కానుక

పాకాల : మండల ప్రజలకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతీ ఇంటికి దుస్తులు పంపిణీ చేశారు. తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం దుస్తులను సరఫరా చేశారు. మండలంలోని గాదంకి, ఇరంగారిపల్లి, పాకాల, దామలచెరువు పంపిణీ కార్యక్రమాల్లో మోహిత్‌రెడ్డి పాల్గొని ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని 18,996 కుటుంబాలకు దుస్తులను అందజేశారు. సర్పంచ్ కస్తూరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్.జయదేవ్‌నాయుడు, తుడా మాజీ చైర్మన్ బి.ప్రభాకర్‌చౌదరి, ఎంపీపీ లోకనాథం, కపిలేశ్వర్‌రెడ్డి, చంటి, రమేష్, స్పెషల్ అధికారి లోకేశ్వరి పాల్గొన్నారు.

సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై శిక్షణ



రైతులకు పురుగు మందులు అందజేస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

ఏర్పేడు: మామిడి పూతలో తేనెమంచు పురుగు నివారణకు థయోమిథాక్సామ్ పిచికారీ చేయాలని రాస్ కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త పీఎస్ సుధాకర్ సూచించారు. శుక్రవారం రేణిగుంట మండలంలోని కరంబాడి రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మామిడి పూతలో ప్రస్తుతం తేనె మంచు పురుగు ఆశిస్తోందన్నారు. అనంతరం వివిధ రకాల పురుగు మందులను రైతులకు అందజేశారు.

మహిళావర్సిటీ, ఇండియన్ కలినరీవర్సిటీ మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

తిరుచానూరు: విద్యార్థుల అభ్యున్నతిని ఆకాంక్షిస్తూ శ్రీపద్మావతి మహిళా వర్సిటీ, గృహ విజ్ఞానశాస్త్రం ఇండియన్ కలినరీ వర్సిటీలు శుక్రవారం సంయుక్తం ఒప్పందం చేసుకున్నా యి. ఈ సందర్భంగా మహిళావర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ కే.రాజారెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందం మేరకు రెండు విద్యాసంస్థల మధ్య ఉన్న సదుపాయాలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఈ ఒప్పందం రెండు విద్యాసంస్థల రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు ఉంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళావర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజిని, గృహవిజ్ఞానశాస్త్రం హెచ్ఓడీ ఎం.అరుణ, పీఆర్ఓ రజని, ఇండియన్ కలునరీ ఇన్‌స్టిట్యూట్ అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.త్రిలోక్‌చంద్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాలి

తిరుపతి తుడా : ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులను ఎప్పటికప్పుడు కాపాడుకుంటూ, అధిక ఉత్పత్తులు సాధించేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంపై దృష్టి సారించాలని తుడా సెక్రటరీ లక్ష్మి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం-2023 నూతన సంవత్సర డైరీని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జై జవాన్.. జై కిసాన్ అనే నినాదంతో దేశ ఆహార భద్రతకు రైతులు చేస్తున్న సేవలను లెక్క కట్టలేమన్నారు. రైతు సంఘాలు రైతులకు మంచిచేసే ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందించడంపై దృష్టి సారించాలని చెప్పారు. పలు పంటలకు సంబంధించిన ముందస్తు సూచనలు, సలహాలను చేరవేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.జనార్దన్ మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తూ తమ సంఘం పోరాటాలు చేస్తోందని గుర్తు చేశారు. రైతుల సంక్షేమమే తమ ఉత్తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బెల్లంకొండ శ్రీనివాసులు, సుబ్రమణ్యంరెడ్డి, ఈశ్వరయ్య, డాక్టర్ కె.గంగాధర్, అయ్యప్పనాయుడు పాల్గొన్నారు.



రైతు సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మి

సేంద్రియ పంటలతో సంపూర్ణ ఆరోగ్యం

రామచంద్రాపురం: సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేసిన పంటను తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ సీఈఓ రామారావు అన్నారు. మండలంలోని కుప్పంబాదూరు, చిట్టత్తూరు కాలేపల్లి గ్రామాల్లో శుక్రవారం సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మునిరత్నం, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యవసాయ సిబ్బందితో మాట్లాడుతున్న సీఈఓ

వైస్ ఎంపీపీకి మాతృ వియోగం

పాకాల : మండల వైస్ ఎంపీపీ చిటిపిరాళ్ల చెన్నకేశవరెడ్డి తల్లి చిటిపిరాళ్ల లక్ష్మమ్మ(92) గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. సమాచారమందుకున్న తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శుక్రవారం ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, హరికృష్ణారెడ్డి, ఉమాకాంత్ రెడ్డి, చినబాబు పాల్గొన్నారు.



చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

27 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 27 మందికి రూ.22,800 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. వీరిని తిరుపతి పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా ముగిసిన నీరాటోత్సవాలు



బంగారు తిరుచ్చిపై ఊరేగింపుగా విచ్చేస్తున్న శ్రీఆండాళ్ అమ్మవారు



విరాళం అందజేస్తున్న దాతలు కూరపాటి గీతశంకర్ రెడ్డి దంపతులు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో వెలిసిన శ్రీఆండాళ్ అమ్మవారి నీరాటోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ఈ నెల 7నుంచి ఆరంభమైన అమ్మవారి నీరాటోత్సవాలు వారం రోజుల పాటు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారు బంగారు తిరుచ్చిపై శ్రీగోవిందరాజస్వామి ఆలయం నుంచి శ్రీరామచంద్ర తీర్థకట్టకు ఊరేగింపుగా వేంచేశారు. అక్కడున్న మండపంలో అమ్మవారిని కొలువు తీర్చి వేడి నీళ్లతో అభిషేకం చేశారు. సాయంత్రం వరకు అమ్మవారు అక్కడే ఉండి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీఆండాళ్ అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువు తీరి శ్రీకోదండరామాలయం చుట్టూ ప్రదక్షిణ చేసి శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ప్రతి ఏటా ధనుర్మాసంలో ఆండాళ్ అమ్మవారు స్వామివారి కోసం చేసిన తపస్సుకు ప్రతీకగా ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వీఆర్.శాంతి, ఏఈవో రవికుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్‌మూర్తిరాజు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీమూలస్థానమ్మకు విరాళాల వెల్లువ

చంద్రగిరి: మండల కేంద్రంలోని గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరివిగా విరాళాలను అందజేస్తున్నారని ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. తిరుపతికి చెందిన కూరపాటి గీత శంకర్ రెడ్డి దంపతులు శుక్రవారం ఆలయ పునర్నిర్మాణం కోసం రూ.10లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. ఈఓ రామకృష్ణారెడ్డి, చైర్మన్‌లు దాతలను సత్కరించారు. వారు మాట్లాడుతూ త్వరలోనే ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు రూ.32.88 లక్షలు ఆలయ పునర్నిర్మాణానికి విరాళంగా అందినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బొబ్బిళ్ల కిషోర్, సీఎం కేశవులు(బుజ్జి), కోలా మల్లి, వేమా రెడ్డి, తానాటి మాధవి, ఇతర పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.